# 29.

# ప్రకృతి, పరమాత్మల సంబంధం

జనన మరణ మధ్యమందు జగన్నాటక రంగమందు
కామక్రోధ గానములు లోభమోహ గీతములు
మదమత్సరముల వేషములు వ్యామోహపు నడకలు
నవరస ప్రదర్శనములు తుదకు శాంతి పాఠములు

పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత
సంసారమొక చింత చావు చింత
బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత
జీవించుటొక చింత చెడుపు చింత
కర్మలన్నియు చింత కష్టముల్ చింత
సంతసమొక చింత వింత చింత
ఖండఖండాతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్యవీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాలా ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరత భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమై యున్నట్టి
భరత భూమియందు ప్రభవమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె బాలులార!

srisathyasaivachanamrutam

ప్రకృతి అనాది. ఇది వయోనిర్ణయములకు అతీతమైన వృద్ధనారి. ఈమె క్షణమైన పురుషుని ఎడబాటు ఉండేది కాదు. ఒక్క క్షణము పురుషుని ఎడబాయక ఉండెడి మహా పతివ్రత ఈ ప్రకృతి. ఈమె యొక్క సౌందర్యమా వర్ణనాతీతము. ఈమె యొక్క శక్తి సామర్థ్యములు అగమ్య గోచరములు. క్షణములో ఏమరపాటు కలిగినప్పుడు అయోమయమైన సంసారమునందు కూలద్రోస్తుంది. మహనీయులను సహితము ఒక్క క్షణములో వారు దైవచింతనకు పెడమార్గము పట్టిన వారిని క్షణములో బంధనలో చిక్కించి అనేక రకములైన ఇక్కట్లకు గురిచేస్తుంది. అట్టి ప్రకృతిమాతకు మనము వశము కావటమా లేక ప్రకృతి మాత మనలను వశము చేసుకోవటమా, ఇందులో ఏది ప్రధానము అనేది మనము ఈనాడు నిర్ణయించవలసిన విషయము.

## జ్ఞానసహిత వైరాగ్యమే మోక్షానికి మార్గం

మట్టి లేక కుండ, లోహము లేని నగ, దారము లేని వస్త్రము, బ్రహ్మము లేని ప్రకృతి ఉండుటకు వీలుకాదనే సత్యమును ఈ ప్రకృతి మనకు ప్రబోధిస్తూ వచ్చింది. కనుక ప్రకృతిని వేరుగా పరమాత్మను వేరుగా మనము భావించి ఊహించటమనేది కేవలము అజ్ఞానము యొక్క చిహ్నమే. ప్రకృతిని వశము నందుంచుకొని మన పవిత్రమైన జీవితమును ఇందులో ప్రకాశింప చేసుకోవటానికి పూనుకున్న వ్యక్తికి నిరంతరము జయమే. కాని ప్రకృతికి వశమైన వ్యక్తి నిరంతరము తాను తాపత్రయములతో క్రుంగిపోవలసిన అవస్థలపాలై పోతుంటాడు. లోకమునందు ఎట్టి కార్యమునందైనా విజయమును సాధించదలచిన వ్యక్తి, ప్రకృతిని వశము చేసుకున్నప్పుడే ఇందులో విజయాన్ని సాధించటానికి వీలవుతుంది. అయితే, ప్రకృతి ప్రజలయొక్క సొత్తుకాదు, లేక వ్యక్తి యొక్క సొత్తు కాదు. ప్రకృతి పరమాత్ముని యొక్క సొత్తు. పరమాత్ముని అనుజ్ఞ బడసి ఈ ప్రకృతిని మనము అనుభవించుకోటానికి తగిన అధికారము ఉన్నది. భగవదనుగ్రహమును పొంది ప్రకృతిని మనము అనుభవించుటకు పూనుకున్నప్పుడు ప్రకృతి మన ఇష్టమునకు లోబడి తగిన ఆనందమును అందించుటకు పూనుకుంటుంది. ఈనాడు అధికారియైన భగవంతుని విస్మరించి కేవలము ప్రకృతియే కావాలని ప్రకృతినే విశ్వసించి ఈ ప్రకృతిని అనుభవించ టానికి తగిన ప్రయత్నము చేయటం చేత ఇందులో

sri sathyasai vahini vachanamrutam

పరాభవమును పొందుతున్నాము. అపజయమును అందుకుంటున్నాము. దీనికి రామాయణమే మనకు సరియైనటువంటి ప్రమాణము. అనేక శక్తి సామర్థ్యములు కలిగినటువంటివాడు, అనేక యజ్ఞ యాగాది క్రతువులు ఆచరించినవాడు, సర్వవిద్యలయందు ఉత్తీర్ణుడైనవాడు, మహాశక్తి సామర్థ్యములు కలిగిన రావణుడు రాముని ధిక్కరించి కేవలం సీతనే కావలెనని కోరటంచేత తాను ఏమాత్రము సీతను దక్కించుకొనలేక, చిక్కించుకొనలేక కట్టకడపటికి తన రాజ్యమును, తనయొక్క ప్రజలను భస్మము చేసుకొని తనయొక్క తత్త్వమును కూడను భస్మమొనరించుకున్నాడు. సీత భూజాత, రాముడు మహాపురుషుడు. భూజాతను వరించినటువంటివాడు రాముడు. కనుక రాముని అనుజ్ఞ లేక భూజాతను అనుభవించుకోవటానికి తగిన ప్రయత్నము సల్పటంలో మనకు ఎట్టి విజయము ప్రాప్తించదు. సీత ఎలాంటిదనగా, రామచంద్రుని అరణ్యమునకు పంపే సమయములో రాముడు వచ్చి సీతను 'నీవు తల్లిదండ్రులకు సేవలు చేయుచు, అయోధ్యయందే నివసించమనియు తాను 14 సం॥లు అరణ్యవాసమును అనుభవించి వస్తాననియు' చెప్పినప్పుడు సీత తనయొక్క సౌఖ్యములు తనయొక్క భోగములు సర్వమును త్యాగము చేసి రామునితో ప్రయాణమైనది. లోకమును త్యాగము చేయటము వలన రాముడు ఆమెకు దక్కినటువంటి సత్యము మీకు విదితమే. కారణమేమనగా సతికి పతియే దైవమనియు, అట్టి పతి భక్తియే ఈ సతికి సరైన వ్రతమనియు ఇట్టి వ్రతమే భారతీయులయొక్క సమ్మతమనియు, ఇట్టి సమ్మతమైనదే భారతీయుల యొక్క హితమనియు సీత ప్రబోధించినటువంటిది. ఇట్టి నీతియే మన భారతదేశమునకు జ్యోతివలె ప్రకాశించినదని సీత ప్రబోధించింది. తన సర్వకామమును దూరము చేయటము చేతనే రాముడు ఆమెకు దక్కాడు. అయితే, మాయ యొక్క విచిత్రము, మాయ యొక్క వికారము, మాయ యొక్క శక్తి సామర్థ్యములు ఒక్కొక్క పర్యాయము ఎట్టివారైనా తప్పించుకొనుటకు సాధ్యము కాదు. మహా విలువైనవన్నీ త్యాగముచేసి అరణ్యవాసము చేయుచున్న సీతకు ఒకానొక దినమున సువర్ణజింక కనిపించిన తక్షణమే ఆ సువర్ణ జింక కావాలని కోరటం, ఆ జింక నిమిత్తమై రాముడు పోవటం కట్టకడపటికి సీత రావణుని హస్తమునందు చిక్కుకొని అరణ్యము వదలిపెట్టి లంకను చేరటం జరిగింది. దీనియొక్క అంతరార్థము ఏమనగా కామమును దూరం చేసుకున్నప్పుడు రాముడు చిక్కినాడు. కాని తిరిగి ఈమె కామము వెంట పరుగెత్తినప్పుడు రాముడు దూరమయ్యాడు. కనుక, మనకు రాముడు

srisathyasaivahini.org

దక్కాలనుకున్నప్పుడు కామము విసర్జించాలి. కామమును మనము దక్కించుకోవటానికి ప్రయత్నము చేసినప్పుడు రాముడు మనకు దూరమైపోతాడు. అందువలననే

**ఆశకు దాసుడైన జగమంతటికీ తను దాసుడే కదా.**
**ఆశను జయిస్తే జగమే తనకు దాసత్వము వహిస్తుంది**

ఆశను జయిస్తే జగమంతటినీ తాను జయించవచ్చు. ఇట్టి వైరాగ్యమును పొందే నిమిత్తమై వేదాంత మార్గమందు సాలోక్యము, సారూప్యము, సామీప్యము, సాయుజ్యము అనే నాలుగు మార్గములు నాలుగు విధములుగా మనకు అందిస్తూ వచ్చారు. అయితే ఈ వైరాగ్యము జ్ఞాన సహితమైన వైరాగ్యముగా ఉంటుండాలి గాని జ్ఞానరహితమైన వైరాగ్యము ఉండకూడదు. ఇట్టి జ్ఞాన సహితమైన వైరాగ్యమునే పరా వైరాగ్యమని పిలుస్తూ వచ్చారు. స్థూలమునే సాలోక్యమని, సూక్ష్మమునే సామీప్యమని, కారణమునే సారూప్యమని ఈ మూడింటి వివరములు గుర్తించి వాటియొక్క రహస్యములు చక్కగా తెలుసుకొని విషయ సంబంధమైన వాటిని ఛేదించిన తరువాత పవిత్రమైన మహాకారణ స్వరూపమైన సాయుజ్యము ప్రాప్తిస్తుందని కూడను ప్రబోధించారు. దీనినే దేహత్రయములని చెప్పబడుతూ వచ్చింది. అయితే, ఇట్టి దేహత్రయములను జయించి ఆ మహా కారణ స్వరూపమైన సాయుజ్యము పొందిన తరువాత దానికి సాక్షి స్వరూపము లోపల గుర్తిస్తుంటాడు. ఈ స్థూలరూపములోనున్న జీవునకు కారణమునందు ప్రతిబింబింపచేసే చైతన్యమే ఒక సాక్షిగా ఉంటుంది. అయితే ఇట్టి సూక్ష్మమైన దేహమునందున్న తత్త్వము అనగా ఈశ్వరత్వము ఒక విధమైన ఆత్మతత్త్వము లోపల కొంతవరకును రమిస్తుంటాది. సాక్షిగా ఉంటుంది. ఇందులో కారణ తత్త్వమైన దేహమునుంచి, కొన్ని రకములైన సుషుప్తి మార్గమునందు బయలుదేరి అక్కడ పరమాత్మ అనే తత్త్వములో సాక్షిభూతుడై నిలుస్తూఉంటుంది. మహాకారణదేహ స్వరూపమైన సమయములో తురీయావస్థ యందు కేవలం పరబ్రహ్మ సాక్షత్వమై అక్కడ ప్రకటిస్తూ ఉంటుంది. అట్టి బ్రహ్మతత్త్వమే ఉపాధి రహితమైనటువంటి దీనికి సర్వసాక్షి స్వరూపుడై ప్రకటిస్తుంటాడు. కనుక, అట్టి ఉపాధి రహితమైన బ్రహ్మతత్త్వము సర్వసాక్షి స్వరూపుడుగా నిల్చిన తత్త్వము లోపల మనయొక్క జీవతత్త్వాన్ని అందులో లయపరచే ప్రయత్నమునకు ఇట్టి సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యములు అత్యవసరములు. ఇట్టి బ్రహ్మ తత్త్వము రూపరహితమైనది కనుక మనము

srisathyasaivachanamrutam

అట్టి దానిని తెలుసుకునే నిమిత్తమై ఒక రూపమును మనము నిర్మించుకొని ఆ రూపమునందు మనము అనేక రకములైన సాధనలు సల్పుతూ దానిని చూస్తూ ఉండగా అందులో ఒక విధమైన చూచేటువంటి జ్ఞానము, చూడబడే రూపము, రెండూ లయమై పోతుంటాయి. మనము అనిత్యమై, అశాశ్వతమై, క్షణభంగురమైన అనుభూతిని, నిత్య సత్య నిర్మలమైనటువంటి శాశ్వత అనుభూతి క్రింద మార్చుకోటానికి ఒక ఆధారము అవసరము. ఆధారము లేక ఆధేయమును మనము పొందటానికి వీలులేదు. స్థూలమైన రూపమును మనము ఒకదానిని ఆధారము చేసుకొని దీనిని సూక్ష్మమైన, కారణమైన, మహాకారణమైన స్వరూపకంగా మార్చుకోవటానికి తగిన శక్తి సామర్థ్యములను మనము సంపాయించుకోవచ్చు. అదే శాశ్వతమైన స్థితియందు మనము అనుభవించవచ్చు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. మనము ఇప్పుడు ఈ పెండాలులో అనేకమంది కూర్చొని ఉంటున్నాము. అయితే, ఎవరికి వారు చింతించినప్పుడు నాతో అనేకమంది ఉంటున్నారు ఈ పెండాలు, ఇందులో స్వామి కూడను స్టేజి ఎక్కి మాట్లాడుతున్నాడు. ఈ స్వామిని స్టేజిపై చూడటము అనేకమంది తనతో చేరినవారు ఈ పెండాలులో ఉండటము తాను ప్రత్యక్ష అనుభూతి. అయితే ఇంతమంది వ్యక్తులతో స్వామి యొక్క సంభాషణ వింటూ నీవు పెండాలులోపల వుంటున్నావు. అయితే పెండాలులో ఎంతసేపు ఒక గంట అని నిర్ణయమైన టైము లిమిట్. కాలమునకు మనయొక్క అనుభవమునకు ఒకవిధమైన హద్దును ఏర్పరచుకోవచ్చు. అయితే, నీవు నీ స్వస్థానమునకు వెళ్లిన తరువాత ఏ ఢిల్లీయో, కలకత్తానో వెళ్లిన తరువాత ఈ పెండాలులో మేమందరము కూర్చునట్లుగాను, స్వామి సంభాషణ చేస్తున్నట్లుగను నీవు చింతించినప్పుడు నీ హృదయములో ఈ పెండాలు, స్వామి నీ హృదయము లోపల నిల్చిపోతుంటారు. అనగా పూర్వము, నీవు నీతోటి విద్యార్థులు పెండాలు లోపల ఉండటము కొంతకాలము మాత్రమే నిర్ణయము కావటము, నీ స్వస్థానము నకు వెళ్లిన తరువాత, నీ జీవితములో ఎప్పుడు ఈ దృశ్యాన్ని చింతించినప్పటికిని ఈ పెండాలు, ఈ స్వామి నీ హృదయములోపల శాశ్వతముగా నిల్చిపోవటం దీనికి ఎంత మార్పుగా వుంటుండాదో యోచించుకోవచ్చు. ఇది ఒక ఆధారమైన సమావేశములో పాల్గొనటంచేతనే కదా ఆధేయమనే శాశ్వతమైన పిక్చరు నీ హృదయములో నిల్చిపోవటం. కనుక మొట్టమొదట మనము ఏదో ఒక దానిలో ఉండటము, తదుపరి దానిని

మనలో చేర్చుకోవటము తదుపరి మనమే అది అయిపోవటము. దీనినే మూడు మార్గములుగా చెప్పారు. You are in the light. The light is in you. You are the light కనుక మొట్టమొదట నీవు జగత్తులోభాగం కావాలి. ఆ జగత్తు అనే లైటును తరువాత నీలో చేర్చుకోవాలి. కట్టకడపటికి నీవే ఆ జగత్తుగా మారిపోవాలి. కనుక ఈవిధమైన మార్పులు మనము చేసుకుంటూ, మన వలన ఈ ప్రకృతి గానీ, ప్రకృతి వలన మనము కాదు అనే సత్యాన్ని గుర్తించుకోవాలి. మనమే లేకపోతే ప్రకృతే లేదు. కనుక మనవల్ల ప్రకృతిగాని, ప్రకృతి వల్ల మనము కాదు. అనేకమంది అనేక రీతులుగా భావిస్తుంటారు. మానవునికి తిండి అవసరమని చాలామంది ప్రబోధిస్తుంటారు. కానీ నా ఉద్దేశ్యము ఏమంటే తిండికోసము మానవుడు పుట్ట లేదు. మానవుని నిమిత్తమై తిండి పుట్టింది. **కనుక పుట్టిన తరువాత తిండి అవసరము గాని తిండికోసం మానవుడు పుట్టలేదు అనే సత్యాన్ని మానవుడు చక్కగా గుర్తుంచుకోవాలి.** అదేవిధముగా మనము కొన్ని విధములుగా జగత్తును తీర్చిదిద్దే నిమిత్తమై, ధర్మసంస్థాపన నిమిత్తమై, సత్యాన్వేషణ నిమిత్తమై సత్యప్రకటన నిమిత్తమై మనము వచ్చాము. దానిని లక్ష్యమునందుంచుకొని మిగిలినవన్నియు మనకు ఉపాంగములుగా భావించుకోవటం సక్రమమైన మార్గము. కాన మనము అన్నము నిమిత్తమై పుట్టినవారమైతే లోకములో అన్నము ఉండికూడను దేహమును విసర్జించిపోయినటువంటి వారి గతి ఏమిటి? అన్నము లేకపోయి నప్పటికిని ఈ జగత్తులో నివసిస్తున్నవారి పరిస్థితి ఏమిటి? కనుక, మనము ఆహార నిమిత్తమై రాలేదు, ఆత్మ నిమిత్తమై వచ్చాము. ఆత్మ నిమిత్తమై వచ్చిన ఈ కాయమునకు ఆహారము అవసరమైపోయింది. అంతేగాని, మనకు కారే లేకపోతే పెట్రోలును ఎవరూ ఆశించరు. అయితే కారెందుకు? మనము ఏవో కొన్ని ప్రదేశములకు ప్రయాణము చేసే నిమిత్తమై ఈ కారును మనం కొన్నాము. కారు అవసరమే లేకపోతే విలువైన ధనమును అక్కడపోసి మనము కారును తీసుకోము. వేల రూపాయలు పోసి కారు కొన్న వ్యక్తి ఆ విలువైన కారును ఏరీతిగా start చేయాలి, ఏరీతిగా drive చేయాలి, ఏరీతిగా దానిని శుభ్రము చేయాలి అనే విధానమే తాను తెలుసుకొనకున్న, ధనమును, పదార్థమును తాను దుర్వినియోగ పరచిన వాడౌతాడు. అదేవిధముగా అనేక జన్మముల పుణ్య ధనమును ప్రోగుచేసి దేహము అనే రథాన్ని మనం అందు కున్నాము. ఈ రథమును మనము ఏరీతిగా ఉపయోగించుకోవాలి? ఈ రథమును

srisathyasaivachanamrutam

ఏరీతిగా సరియైన కండిషన్‌లో పెట్టుకోవాలి? ఈ రథమును ఏ మార్గములో నడిపించి సక్రమమైన స్థానము చేరాలి? అనే విషయమునకు తెలియ కుండా పోయినప్పుడు ఇంక రథముగాని, ఈ రథమునకున్న పవిత్రమైన పుణ్య ధనముగాని వృధా పరచుకున్నవారమై పోతాము. కనుక, మొట్టమొదట దేహమును ఆరోగ్యవంతమైన దేహముగా మనము చక్కగ పరిశుద్ధపరచుకోవాలి. దీనినే ధర్మ అర్ధ కామ మోక్షానాం ఆరోగ్యం మూలముత్తమం అన్నారు. ఆరోగ్యము ఈ ధర్మ అర్ధ కామ మోక్షములను సాధించటానికి అవసరం. కనుక, ఈ దేహమనే కారును సరియైన కండిషనులో పెట్టుకొని సక్రమమైన ఆరోగ్యము చూచుకుంటూ పోవటం ఒకటి. రెండవది ఏ నిమిత్తమై దీనిని ఇంత భద్రము చేసుకోవాలి అంటే మనము ఈ జగత్తుయొక్క సత్యస్వరూపాన్ని, తనయొక్క సత్య స్వరూపాన్ని తాను సాక్షాత్కరించు కునే ప్రయత్నానికి రథమును ఆధారము చూసుకోవాలి. పరోపకార సంబంధమైన సత్కర్మలయందు, పవిత్రమైన సత్కర్మలయందు కొంత లోకమునకు సత్యమును ప్రకటించే మార్గమునందు పవిత్రమైన దైవశక్తులనంతా సమత్వమైన దివ్యత్వాన్ని చాటే కార్యములందు ఈ దేహాన్ని ప్రవేశింపచేయాలి. అయితే ఈ కార్యముల నిమిత్తమై మనము ఈ రథమును నడుపుకొనిపోతుంటే చక్కని సక్రమమైన మార్గములో పోవాలిగాని కొండ మిట్టలు, గుట్టలు వక్రమ మార్గములో మనము డ్రైవ్ చేయకూడదు. దుర్గుణములు, దురాలోచనలు, దుస్సంగములు, దుర్భావములు ఇలాంటి మార్గములందు ఈ కారును నడపటానికి పూనుకో కూడదు. ఇలాంటి పవిత్రమైన రీతిగా మన రథమును సక్రమంగా చూచుకుంటూ జీవితము లోపల మనము ఈ జగత్తుకు వచ్చినందుకు, ఈ జగత్తు అనే యంత్రములో చిన్నపార్టుగా భావించి మన కర్తవ్యము మనము నిర్వర్తించటానికి పూనుకోవాలి. ఇట్టి అద్వైతమును మనము లక్ష్యమునందుంచు కొని ద్వైతము లోపల మన విచారణ ప్రారంభించాలి. ద్వైతములో మనము విచారణ సల్పినప్పుడే అద్వైతము మనకు స్పష్టముగా గోచరిస్తుంది. కానీ ప్రారంభమునందే మనము ఒకవిధమైన ఆధారము తీసుకొని క్రమక్రమేణా దానిని పెంచుకుంటూ మన లక్ష్యములో లీనమైన సమయము లోపల ఆధారమును మనము దూరము చేసుకోవచ్చు. ఈత నేర్చుకునే సమయమునందు టైర్సో లేక కఱ్ఱబుంగలో ఏదో ఒక రకమైన ఆధారము పట్టుకొని నీటిలో ప్రవేశిస్తారు. కానీ, ఈత నీవు నేర్చుకున్న తరువాత ఈ సహాయకారులను ప్రక్కకు

నెట్టివేస్తావు. అయితే, ప్రారంభములో ఆవిధమైన సహాయములే మనకు లేకపోయిన ఈత మనము నేర్చుకోలేము. కనుక, ప్రప్రధమములో ఒక విగ్రహమో లేక ఫోటో లేక ఒక శబ్దమునో, ఏదో ఒక మాతృదేవి, పితృదేవులనో ఒక ఆధారమును మనము హృదయము నందుంచుకొని క్రమక్రమేణా నిర్వికారమైన, పవిత్రమైన, సర్వవ్యాపకత్వమైన ఏకత్వమైన ఆత్మ తత్త్వమునందు లక్ష్యము నుంచు కోవచ్చు. అద్దము ఉంటే కదా మనము ప్రతిబింబము చూడగలుగుతున్నాము. అద్దము లేకపోతే మనము ప్రతిబింబము చూడలేము. ఆ ప్రతిబింబము, నీవు అనే స్థితి వున్నంతవరకు ఇది ద్వైతమే. కాని బింబ ప్రతిబింబములకు మధ్యలో అద్దము అనేది ఉంటున్నాది. ఆ అద్దమును తీసివేసిన, ప్రతిబింబము లేదు, అద్దము లేదు. నీవు మాత్రము ఏకమౌతావు. ఇదే అద్వైతము అన్నారు. అదే విధముగా నేడు ఒక ఆధారమును తీసుకొని తద్వారా నీ ప్రతిబింబము దర్శించి తదుపరి ఆధారమును దూరము చేసి బింబ ప్రతిబింబముల ఏకత్వాన్ని నీవు మహాకారణ శరీరమైన సాయుజ్యమునందు అనుభవించుకోటానికి పూనుకోవచ్చు. కానీ, మనము జగత్తుతోచేరి, సంసారముతో కూడి ఈ జగత్తు, సంసారము, తాను ఈ మూడింటి యొక్క ఏకత్వములోపల పరమాత్మ తత్త్వాన్ని నిరూపించటానికి తగినటువంటి ప్రయత్నము సల్పాలి. మానవుడు ఒక్కడే ఏకాకియై కేవలము నీటిపై పడిన తైలపు బొట్టువలే నిల్చుటానికి వీలుకాదు. ఎవరు లేకపోతే తన జన్మము లేదో అట్టి ఆధారమైన వారిని, జన్మించిన తరువాత తగిన రీతిని మనము ప్రసన్నులను గావించాలి. మొట్ట మొదట నీవు, నీ తదుపరి నీ కుటుంబము, నీ కుటుంబము తదుపరి సమాజము. సమాజము, కుటుంబము తాను ఈ మూడింటి యొక్క ఏకత్వములో నున్నటు వంటి దివ్యత్వాన్ని మనము గుర్తించాలి. సొసైటీనే లేకపోతే family యే లేదు. ఫ్యామిలీయే లేకపోతే వ్యక్తే లేదు. తాను లేకుండా పోవటానికి ఏది కారణమో రెండింటికి సమాజము కారణము కనుక సమాజము లోపల సచ్చిదానంద మూర్తిని సందర్శించుకోవాలి. వ్యక్తి అనే రివర్, కుటుంబమనే ట్యాంకును నింపి తద్వారా సమాజము అనే సరోవరములో లీనమైపోతున్నాది. కనుక మనము జీవితమును కేవలము ఏకాకి జీవితముగా భావించుకోకుండా దైవత్వమనే సర్వ వ్యాపకుడు సర్వత్రా వుంటున్నాడనే సత్యమును విశ్వసించి తద్వారా మనయొక్క జీవితమును అందులో ప్రవేశింపచేయటానికి తగిన ప్రయత్నము చేయాలి.

srisathyasaivachanamrutam

**నిరత సత్య ప్రౌఢి ధరణి నేలిన హరిశ్చంద్రుడీ ధరను బాసి చనగలేదె!**

లోకములో అన్ని రకములైన శక్తి సామర్థ్యములు మనము పెట్టుకున్నామంటే ఇది ఏనాటికైనా ఒకనాడు మనము వదలిపెట్టిపోక తప్పదు. కనుక, ఇట్టి దీనిని సత్యముగా మనము విశ్వసించక, సత్యమైనటువంటి దైవమును మనము హృదయపూర్వకంగా విశ్వసించి తద్వారా ఈ మిథ్యమైన జగత్తును అనుభవించుకోవటానికి ప్రయత్నము చేయాలి.

**ఎల్లలోకములేలె నెసగ శ్రీనలరాజు తన వెంట భూమిని గొనుచు చనెనె**
**కృతయుగంబునకు అలంకృతి చేయు మాంధాత సిరిని మూటకట్టుక నరిగినాడె**
**జలధిసేతువు కట్టె అలనాటి శ్రీరాముడు డిప్పుదుర్విపైనున్నవాడె**
**ఎందరెందరొ రాజులు ఏగినారొ! ఒక్కడును వెంటగొనిపోవరీ ఉర్వితలము**
**నీవుమాత్రము నీదు రాజ్యము తలకు కట్టుకపోదువా ధర్మహృదయ!**

అయితే, వారు ఈ లోకమును వదలిపెట్టి వెళ్లే సమయములో లోకమునకు ఒక పవిత్రమైన, శాశ్వతమైన, సత్యమైన ఆదర్శములను అందించి పోయినారు. కనుక మనము అందించేది పవిత్రమైనదిగా వుండినప్పుడే మనము ఈ దేహమును లోకమునుండి వీడినప్పటికిని మనము జీవించిన వారముగనే అవుతాము కాని, అట్లుకాకుండా లోకమునకు కీడును తలపెడుతూ, లోకమునకు అపకారమును సలుపుతూ జీవించి ఉండినప్పటికిని ఇది కేవలము living death అనే చెప్పవచ్చును. కనుక, మనము పవిత్రమైన మానవజన్మ ఎత్తినందుకు ఈ జగత్తులో ఈ సమాజములో ఇలాంటి పరిస్థితిలో మనము పుట్టినందుకు ఏ కించిత్తైనా మంచిని చేసి, ఏ కించిత్తైనా మంచి అనుభవించి దేహమును వీడటము లోపల ఈ జన్మకు సార్థకముంటున్నాది.

**(తేదీ 15-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam